

బీఆర్ఎస్‌లో చేరుతున్న మహిళలకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న తెల్లం వెంకట్రావు

# బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

భద్రాచలం, నవంబర్ 26 : భద్రాచలం బీఆర్ఎస్ పార్టీలో శనివారం రాత్రి పలువురు చేరారు. వివిధ పార్టీ నుంచి చేరికలు జోరుగా సాగుతున్నాయి. 141 బూత్ ఇన్‌చార్జి రేపాక పూర్ణ చంద్రరావు ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, రాష్ట్రంలోని ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం అందుతుందన్నారు. గత తొమ్మిదిన్నరేళ్లుగా భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యేలుగా ఉన్నవారు నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని, వారి స్వలాభాన్ని మాత్రమే చూసుకున్నారని, దీంతో అభివృద్ధి కుంటుపడిపోయిందన్నారు. ప్రజా వైద్యునిగా సేవలు చేస్తున్న తనను గెలిపిస్తే భద్రాచలం అభివృద్ధి చెందుతుందని, ముఖ్యమంత్రితో మాట్లాడి అదనపు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో తాండ్ర రమణారావు, తాండ్ర నరసింహారావు, తాళ్లపల్లి రమేశ్‌గౌడ్, రేపాక కావ్య, రేపాక హరి పాల్గొన్నారు.

# తాలిపేరు పనుల పరిశీలన



పెద్దనల్లబెల్లి వద్ద తాలిపేరు కాలువ పనులను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ నాగేంద్ర

పర్ణశాల, నవంబర్ 26 : దుమ్ముగూడెం మండల పరిధిలోని పెద్దనల్లబెల్లి గ్రామం వద్ద తాలిపేరు కాలువ పనులను ఈఎన్‌సీ బి.నాగేంద్ర ఆదివారం పరిశీలించారు. మండలంలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న తాలిపేరు కాలువ పనులను ఆయన పరిశీలించారు. పెద్దనల్లబెల్లి గ్రామం వద్ద ఇటీవల సుమారు రూ.20 లక్షల వ్యయంతో మరమ్మతు పనులు చేపట్టారు. రైతులకు సాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ వెంకటేశ్వరెడ్డి, ఈఈ రాంప్రసాద్, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

# రామయ్య సన్నిధిలో అధికారుల పూజలు



ఆలయ ప్రాంగణంలో ఎన్నికల పరిశీలకులు

పర్ణశాల, నవంబర్ 26 : మండలంలోని పర్ణశాల పుణ్యక్షేత్రాన్ని ఎన్నికల అబ్జర్వర్‌లు అజయ్‌లాల్ సోనజీ, సంజిత్‌పాల్ ఆదివారం సందిర్శంచారు. ఆలయ గర్భాలయంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పంచవటి కుటీరం సుందర దృశ్యాలను శ్రీరామచంద్రమూర్తి పూజించిన శివాలయంను సీతమ్మవారి నారచీరెల ప్రదేశాన్ని సందర్శించి క్షేత్ర విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ఆలయ సిబ్బంది, సూపరింటెండెంట్ కిశోర్, ఆలయ ఇన్‌చార్జి ప్రసాద్, కిరణ్‌కుమార్ ఆచార్యులు, కంటెం రాము పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్యకు స్వర్ణ పుష్పార్చన

భద్రాచలం, నవంబర్ 26 : భద్రాచలం సీతారామ చంద్రస్వామి దివ్యక్షేత్రంలో ఆదివారం అంతరాలయంలోని మూలవరులకు 108 స్వర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య హోమాలు, నిత్య బలిహరణం తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి సంప్రదాయబద్ధంగా నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

### భక్తులతో కిటకిటలాడిన భద్రాద్రి

కార్తీకమాసం, పౌర్ణమి సందర్భంగా భద్రాచలం రామాలయానికి భక్తులు పోటెత్తారు. వారాంతపు సెలవు దినాలు కావడంతో భక్తులు శనివారం రాత్రికే భద్రాచలం చేరుకొని బస చేశారు. ఆదివారం తెల్లవారుజామున గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి రామయ్యను దర్శించుకునేందుకు క్యూ లైన్లలో వేచి ఉన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేయడంతో ఎటువంటి ఇబ్బంది కలుగలేదు.



రామయ్యకు నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

# సీపీఐ, కాంగ్రెస్‌కు భారీ షాక్

- కొత్తగూడెంలో బీఆర్ఎస్‌కు పెరుగుతున్న గ్రాఫ్
- మొన్న కౌన్సిలర్లు, నిన్న సర్పంచ్, వార్డుసభ్యుల చేరిక
- చక్రం తిప్పుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఈ తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల క్యాడర్ బీఆర్ఎస్ గూటికి చేరుతున్నారు. కాంగ్రెస్, సీపీఐకు చెందిన ముఖ్యనాయకుల చేరికతో బీఆర్ఎస్ గ్రాఫ్ ఒక్కసారిగా పెరుగుతున్నది. ఎన్నికల ఇన్‌చార్జి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర స్కెచ్‌తోపాటు అధినేతల పర్యటనల ప్రభావం కారు స్పీడును మరింత పెంచింది. దీంతో కొత్తగూడెంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న వనమా వెంకటేశ్వరరావు ప్రచారం జెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్నది. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. వందల మంది కార్యకర్తలు, నాయకులు గులాబీ తీర్థం పుచ్చుకుంటున్నారు. వరుస చేరికలతో గులాబీ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గంలో గుబాలిస్తున్నది.



సీపీఐకి చెందిన బాబూక్యాంపు పంచాయతీ సర్పంచ్‌తోపాటు 9 మంది వార్డు సభ్యులను బీఆర్ఎస్‌లోకి చేర్చుకుంటున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర (ఫైల్)

### మొన్న కౌన్సిలర్లు.. నిన్న సర్పంచ్, వార్డుసభ్యులు

సీపీఐ నుంచి ఐదుగురు కౌన్సిలర్లతోపాటు నాయకులు ఇటీవల బీఆర్ఎస్‌లో చేరడంతో సీపీఐ కోటకు బీటలు పడింది. దీంతో వరుస చేరికలు షురూ అయ్యాయి. కార్మిక సంఘం నాయకుడు గుత్తుల సత్యనారాయణ, బాబూక్యాంపు సర్పంచ్ బాబూరావుతోపాటు 9మంది వార్డుసభ్యులు ఎంపీ వద్దిరాజు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిపోయారు. దీంతో బీఆర్ఎస్ బలం మరింత పెరిగింది. దీంతోపాటు కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించి భంగపడిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎడవల్లి కృష్ణ సైతం గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. పాల్వంచకు చెందిన ప్రముఖ నాయకుడు జలగం అనుచరుడు చింతా నాగరాజు సైతం బీఆర్ఎస్‌లో చేరారు. రేకాక మరికొంతమంది నాయకులు కూడా పార్టీలో చేరడంతో వనమా గ్రాఫ్ పెరిగింది.

### చక్రం తిప్పుతున్న ఎంపీ వద్దిరాజు

కొత్తగూడెం బీఆర్ఎస్ అభ్యర్థి వనమా గెలుపు కోసం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చక్రం తిప్పుతున్నారు. ఒకవైపు వనమా ప్రచారంలో దూసుకుపోతుండగా మరోవైపు వద్దిరాజు చేరికల పర్వం కొనసాగిస్తున్నారు. మాజీ మంత్రి కోనేరు నాగేశ్వరరావు కుమారుడు బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసిన కోనేరు చిన్ని సైతం సీఎం కేసీఆర్ సమక్షలో బీఆర్ఎస్‌లో చేరారు. ఇప్పటికే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సైతం వనమా విజయం కోసం ప్రచారం సభలు నిర్వహించారు. దీంతో కార్యకర్తల్లో మరింత జోష్ పెరిగింది.

# తెల్లం వెంకట్రావును గెలిపించాలి

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 26 : భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వాజేడు, వెంకటాపురం ఎన్నికల కో కన్వీనర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గూడవర్తి నర్సింహమూర్తి అన్నారు. వెంకటాపురం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎంపీపీ చెరుకూరి సతీశ్‌కుమార్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటి ప్రచారం చేస్తూ గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో తిరుగుతూ వెంకట్రావుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ అభ్యర్థిని తప్పకుండా గెలిపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిడెం రవికుమార్, డర్రా దామోదర్, వేల్పూరి లక్ష్మీనారాయణ, ముడుంబా శ్రీను, పిల్లారశెట్టి మురళి, జాగరశివాజీ, శాంతమూర్తి, జక్కుల సమ్మయ్య, వినోద్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న నాయకులు

# బొల్లారంలో ముమ్మరంగా ప్రచారం

వాజేడు, నవంబర్ 26 : మండలంలోని మొరుముురు పంచాయతీ పరిధి బొల్లారం గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు బత్తుల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బత్తుల సాయిదేవి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. భద్రాచలం నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. తెల్లం గెలుపుతో భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధి మలుపు తిరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాయం శంకర్‌దాయల్, కుర్సం రాంబాబు, అనిల్ పాల్గొన్నారు.



బొల్లారంలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

# గుట్టలు దిగివస్తాం.. ఓటు వేస్తాం

ఆదర్శంగా నిలుస్తున్న పెనుగోలు ఓటర్లు

20కిలోమీటర్లు నడిచివచ్చి మరీ ఓటు వేయనున్న గిరిజనులు



ఓటరుకార్డులు చూపుతున్న పెనుగోలు గిరిజనులు

వాజేడు, నవంబర్ 26 : ఓటుహక్కు తమ జన్మహక్కుగా భావిస్తున్నారు పెనుగోలు ఆదివాసీ గిరిజనులు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి సరిహద్దు ప్రాంతం, ములుగు జిల్లా భద్రాచలం అసెంబ్లీ నియోజకర్గం(119) వాజేడు మండల కేంద్రానికి 20కిలోమీటర్ల దూరంలో ఉంది పెనుగోలు గ్రామం. ఆ ఊరిలో 19మంది ఓటర్లు ఉన్నారు. వీరు ప్రతి సంవత్సరం మూడు గుట్టలు దిగి, మూడు వాగులు దాటి వచ్చి మారి ఓటుహక్కు వినియోగించుకుంటారు. ఆదివారం మండల కేంద్రానికి వచ్చిన కొందరు పెనుగోలు గిరిజనులను 'నమస్తే' పలుకరించింది. దీంతో తమ దగ్గరనున్న ఓటరుకార్డులను చూపించి వివరాలు తెలిపారు. వాజేడు మండల కేంద్రంలోని జంగాలపల్లి-17 పోలింగ్‌స్టేషన్‌కు ఈ నెల 30 తేదీన వచ్చి ఓటు వేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం కష్టంగా భావించకుండ 20కిలోమీటర్లు నడిచివచ్చి ఓటు వేసి మళ్లీ 20 కిలోమీటర్లు నడిచివెళ్తున్న పెనుగోలు ఓటర్లు ఆదర్శంగా నిలుస్తున్నారు.



పెనుగోలు గిరిజనులు ఓటుహక్కు వినియోగించుకోనున్న పోలింగ్ కేంద్రం